## క్లుప్తంగా

### విద్యార్థి కిట్ల అందజేత



హెచ్ఎంలకు స్టూడెంట్ కిట్లను అందజేస్తున్న ఎంఈఓలు

గూడూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు మండలానికి వచ్చిన విద్యాకానుకలను ఎంఈఓలు సునీలమ్మ, నాగరాజు బుధవారం ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గురువారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. విద్యార్థులకు అందించేందుకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంతో పాటు స్టూడెంట్ కిట్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. పాఠశాలలు, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

### రెసిడెన్షియల్ పాఠశాలలకు కిట్లు పంపిణీ



కిట్లు అందజేస్తున్న ఎంఈఓలు

పాణ్యం: మండలంలోని పది రెసిడెన్షియల్ పాఠశాలలకు వచ్చిన విద్యాకానుక కిట్లను ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం తెలిపారు. ఈ కిట్లలో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బెల్ట్‌లు ఉంటాయన్నారు. మిగిలినవి త్వరలోనే వస్తాయని చెప్పారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బెల్ట్, షూతో కూడిన కిట్లను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.

### పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



కంబదహాల్లో ముళ్లపొదలను తొలగిస్తున్న సిబ్బంది

సి.బెళగల్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని.. ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు, గ్రామ, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. మండలంలోని కంబదహాల్ గ్రామ సచివాలయం, చెత్త సేకరణ కేంద్రం, ఓవర్‌హెడ్ ట్యాంక్ పరిసరాల్లో ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. బుధవారం గ్రామాన్ని సందర్శించిన ఈఓఆర్డీ విషయాన్ని గమనించి, గ్రామ సర్పంచ్ ఈరమ్మ, పంచాయతీ కార్యదర్శి అభిషేకంతో చర్చించి ముళ్ల పొదల తొలగింపు పనులను చేయించారు. జేసీబీతో తొలగింపు పనులను ఈఓఆర్డీ పర్యవేక్షించారు. అదేవిధంగా గ్రామంలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలించి ప్రజలకు శుభ్రమైన నీటిని అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

### ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయుడు

సి.బెళగల్: వివిధ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముడుమల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో 452 మార్కులు సాధించిన కె.ఇందు, ఇంటర్మీడియెట్‌లో 942తో ప్రతిభ కనబరిచిన పవన్ కల్యాణ్, గురుకుల ప్రవేశ పరీక్షలో సత్తాచాటి సీటు సాధించిన ఎం.ఇందు, నిహారిక, అరుణ్‌కుమార్‌కు స్కూల్ అసిస్టెంట్ వేంకటేశ్వర్లుగౌడ్, సర్పంచ్ పెద్దక్క చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గోపాల్‌రావు, గ్రామ పెద్దలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### సుబ్రహ్మణ్యస్వామికి షష్ఠి పూజలు



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

మద్దికెర : శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్ఠిని పురస్కరించుకొని బుధవారం స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, మహామంగళహారతి చేపట్టారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడైన స్వామి ఉత్సవమూర్తులను హోమశాల వద్ద కొలువుంచి హోమములు తదితర కార్యక్రమాలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

# వ్యాధుల కాలం

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- మలేరియా, డెంగీ ప్రబలే అవకాశం
- పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం
- నీటి నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా దోమల నివారణ
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ఉత్తమం

వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, నివాస పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాధులకు కారణమవుతున్నాయి. దోమ కాటుకు గురి కాకుండా, జ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



గచ్చులో దోమ లార్వాలను పరిశీలిస్తున్న ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు (ఫైల్)

కల్లూరు: మారిన వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడడంతో పాటు వైద్య ఖర్చులతో జేబులు ఖాళీ అవుతాయి. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి దోమలు, లార్వాలు విపరీతంగా వృద్ధి చెంది విష జ్వరాలు, డెంగీ, మలేరియా, అతిసారం, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా స్వీయ జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలు తీసుకోవాలి.

**వ్యాధులు ప్రబలే విధానం**

డెంగీ: పగలు కుట్టే ఎడీస్ ఈజిప్ట్ అనే దోమ కాటుతో ఈ వ్యాధి ప్రబలుతుంది. ఈ వ్యాధి సోకిన వారికి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కంటి లోపల కదలికలు తగ్గడం, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతి అవుతున్నట్లు ఉండడం, నోరు ఎండి పోతుండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మలేరియా: అనాఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకితే చలి జ్వరం, విపరీతమైన తలనొప్పి, తదితర లక్షణాలుంటాయి.

చికున్ గున్యా: ఎడీస్ దోమ ద్వారా ఈ వ్యాధి ప్రబలుతుంది. అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కపిస్తాయి.

ఫైలేరియా: మురుగు నీటిలో పెరిగే క్యూలెక్స్ దోమ కాటుతో ఫైలేరియా వ్యాధి ప్రబలుతుంది. మురుగు నీటిలో దోమలు లార్వాలు వృద్ధి చెందకుండా కిరోసిన్,వేస్ట్ ఆయిల్ చల్లి దోమల లార్వాలు నాశనం చేయాలి.

### ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు సీజన్ వ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా గ్రామాల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలందరూ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాచి వడబోసిన నీటినే తాగాలి. ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా చూసుకోవాలి. దోమ తెరలు వాడాలి. జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. -మోతీలాల్ నాయక్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, కల్లూరు

**నివారణ చర్యలు**

- ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి తొట్టిలు, పాత టైర్లు, మురుగు కాలువల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- దోమలు ఇంటిలోకి రాకుండా నియంత్రించేందుకు ఉదయం, సాయంత్రం కిటికీలు మూసివేయాలి.
- ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా డ్రమ్ములు, గమ్ములు, ట్యాంక్‌ల్లో ఉన్న నీటిని పారబోయాలి.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి.
- కూలర్లు, ఫ్రిజ్‌లు, బయట పడేసిన పాత టైర్లు, ఇతర వాటిలో నీరు నిల్వ లేకుండా చూడాలి.

### వివాదాస్పద స్థలం సర్వే



సి.బెళగల్‌లో వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న డీఐఓ సుబ్బారెడ్డి

సి.బెళగల్: మండల కేంద్రంలో వివాదాస్పదంగా ఉన్న సర్వే నంబర్.557లోని స్థలాన్ని డీఐఓ సుబ్బారెడ్డి బుధవారం సర్వే చేయించారు. ఈ స్థలంపై కొంత కాలంగా కొందరి మధ్య వివాదం నడుస్తోంది. వారి ఫిర్యాదు మేరకు గ్రామానికి వచ్చిన డీఐఓ మండల సర్వేయర్లతో స్థలాన్ని కొలతలు వేయించారు. దస్తావేజుల్లో విస్తీర్ణంలో తేడాలను గుర్తించారు. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. మండల సర్వేయర్ నాగభూషణం, సచివాలయ సర్వే సహాయకులు తిరుమల నాయుడు, వేణుగోపాల్ నాయుడు, వీఆర్ఏలు తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: వ్యవసాయశాఖ అనుమతి ఉన్న నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. బుధవారం కోడుమూరులోని విత్తన, ఎరువుల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ప్రతి దుకాణదారుడు అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని తెలిపారు. విత్తన కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మితే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రైతులు లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయొద్దని సూచించారు. గ్రామాల్లో లూజు విత్తనాలు అమ్ముతుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

**రాయితీపై విత్తనాలు పంపిణీ**

గూడూరు రూరల్: పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై కందులు, కొర్రలు పంపిణీ చేస్తున్నట్లు బుధవారం వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అందించేందుకు వ్యవసాయ శాఖ వేరుశనగ, కొర్రలు, కందులను మంజూరు చేసిందన్నారు. వేరుశనగ 20 క్వింటాళ్లు రాగా వాటిని రైతులకు అందజేశామని తెలిపారు. కందులు, కొర్రలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు ఆర్బీకేల్లో పొందవచ్చని పేర్కొన్నారు.

## జీడీపీ పెండింగ్ పనులు పూర్తి చేయాలి



జలవనరుల శాఖ ముఖ్య ఇంజినీర్ కబీర్ బాషాకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు సిటీ: గాజులదిన్నె ప్రాజెక్టు పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ కోరారు. ఈ మేరకు వారు బుధవారం జల వనరుల శాఖ ముఖ్య ఇంజినీర్ కబీర్ బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఏకైక సాగు నీటి ప్రాజెక్టు(దామోదరం సంజీవయ్య సాగర్)అని, ఆ ప్రాజెక్టు మరమ్మతుల పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. లేకపోతే అధిక వర్షాలు కురిసి వరద నీరు భారీగా చేరితే ప్రాజెక్టు భద్రతకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. జీడీపీ ద్వారా కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు, తాగు నీరు అందించాల్సి ఉందన్నారు.

## కలెక్టర్, జేసీకి అభినందనలు



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న ఏపీఆర్ఎస్ఏ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించిన ఘనత కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్యకే దక్కుతుందని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గిరికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆ సంఘం నాయకులు కలెక్టర్, జేసీ, డీఆర్వోలను వారి కార్యాలయాల్లో కలిసి అభినందించారు. అనంతరం ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిరికుమార్‌రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి వెంకటరాజు మాట్లాడుతూ..సమస్యాత్మక జిల్లాగా పేరున్న కర్నూలులో ఎన్నికలు ప్రశాంతంగా జరగడంలో కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నతాధికారుల కృషి ఎంతో ఉందన్నారు. కిందిస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకొని చక్కగా విధులు నిర్వహించడంతో శాంతిభద్రతలకు విఘాతం కలగలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వేణుగోపాల్‌రావు, ఆదోని డివిజన్ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, కర్నూలు డివిజన్ అధ్యక్షుడు రామాంజనేయులు, పత్తికొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు,మల్లికార్జున, కలెక్టరేట్ కార్యదర్శి లోకేష్, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

### పెట్రోల్ బంకులో చోరీ

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున పెట్రోల్ పోసుకునేందుకు ఇద్దరు వ్యక్తులు బైకుపై వచ్చారని, బంకులో పనిచేస్తున్న సిబ్బంది నిద్రిస్తుండగా టేబుల్‌లో ఉన్న నగదును చోరీచేసినట్లు వెల్లడించారు. పెట్రోల్ బంకు నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదుతో సీసీ కెమెరాలు, దొంగల ఫొటోలు, వారి బైకు నంబర్లు తదితర ఆధారాలను సేకరిస్తున్నామని తెలిపారు.

### చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్) : రోడ్డు సైడు వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రోడ్ సైడ్ వ్యాపారస్తుల సంఘం కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. బుధవారం పాతబస్తీలోని సుర్జీత్‌భవన్‌లో రోడ్డు సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వ హయాంలో చిన్న వ్యాపారులకు వడ్డీలేని రూ.10 వేల రుణం ఇచ్చారని, దానిని లక్ష రూపాయలకు పెంచేందుకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నగరాలు, పట్టణాల్లో ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటు చేసి అందులో వ్యాపారాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ట్రాఫిక్, పోలీసుల ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు గౌస్‌బాషా, సల్కాపురం షెక్షా, షఫీ, మహేష్ నాయుడు, షాకీర్, మాలిక్‌బాషా, అల్తాఫ్‌బాషా, శివకుమార్ పాల్గొన్నారు.

### తుంగభద్ర ప్రాజెక్ట్ డీఏఓగా మాధవరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న మాధవరెడ్డి

ఆదోని అర్బన్: తుంగభద్ర దిగువ కాలువ ప్రాజెక్ట్ ఆదోని డివిజనల్ అకౌంట్ అధికారిగా సీహెచ్ మాధవరెడ్డిని నియమిస్తూ ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మాధవరెడ్డి కోసిగి ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పని చేశారు. ఉన్నతాధికారులు పదోన్నతి కల్పిస్తూ ఆదోని తుంగభద్ర దిగువ కాలువ ప్రాజెక్టు డీఏఓగా నియమించారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

## పెద్దాసుపత్రిలో ఏఎంసీ విస్తరణకు చర్యలు



పూర్వ బ్లడ్‌బ్యాంకును పరిశీలిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏఎంసీ విస్తరణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఖాళీగా ఉన్న పూర్వ బ్లడ్‌బ్యాంక్‌ను పరిశీలించారు. ఏఎంసీకి అనుకుని ఉన్న ఇందులో 12 పడకల దాకా ఏర్పాటు చేయవచ్చని అంచనా వేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇందులో ఆక్సిజన్ పైప్‌లైన్, సక్షన్ ఆపరేటర్లు, మానిటర్లు, వెంటిలేటర్లు, ప్రత్యేక మంచాలు తెప్పించి ఆధునీకరించనున్నట్లు ఆయన వివరించారు.

### ఆ ఉగ్రవాదులను ఉరితీయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): జమ్మూ కశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే భక్తులపై కాల్పులు జరిపిన పాకిస్తాన్ ఉగ్రవాదులను బహిరంగంగా ఉరి తీయాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ డిమాండ్ చేశారు. బుధవారం ఆ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. దాడిఘటనను అంతర్జాతీయ వేదికలపై తీసుకెళ్లి పాకిస్తాన్‌ను దోషిగా నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్, నగర అధ్యక్షుడు టీపీ మద్దిలేటి పాల్గొన్నారు.

## 15న డప్పుకళాకారుల సంఘం సమావేశం



కర్నూలు మండల డప్పు కళాకారులతో రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు

కర్నూలు(సెంట్రల్) : ఈనెల 15వతేదీన డప్పుకళాకారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు తెలిపారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో కర్నూలు మండల డప్పు కళాకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో డప్పు కళాకారుల పెన్షన్లను పెంచలేదన్నారు. ఈప్రభుత్వంలోనైనా పెన్షన్‌ను పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జయరాముడు, ఏసన్న, బిచ్చన్న, మద్దిలేటి, నాగరాజు, శేషన్న, ఆనందం, పాపన్న, రోగెన్న, సంటెన్న, నాగేశులు, స్వాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### పేరుకుపోయిన నిర్లక్ష్యం



ఇక్కడ రోడ్డుపక్కన కనిపిస్తున్న చెత్తాచెదారం బీక్యాంప్‌ప్రాంతంలోనిది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాల్సిన మునిసిపల్ అధికారులు ఎన్నికల ప్రక్రియ ముగిసినా ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఫలితంగా పలు కాలనీలు అపరిశుభ్రతతో కంపుకొడుతున్నాయి. పాతబస్తీలో ఈ సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. సాధారణంగా ఎన్నికలకు ముందు ప్రతిరోజు ఉదయాన్నే కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేసేవారు. అలాగే వీధుల్లోని చెత్తకుప్పలను ట్రాక్టర్లలో తరలించేవారు. కొన్ని రోజులుగా ఈ పనులు సక్రమంగా జరగడం లేదు. -కర్నూలు (టౌన్)

## తస్మాత్ జాగ్రత్త!

- వర్షాకాలంలో పిడుగుల భయం
- సురక్షిత ప్రాంతాల్లో ఉండడం ఉత్తమం
- ఎత్తయిన ప్రదేశాలు, చెట్ల కింద ఉండకూడదు
- గుడిపేముల మండలంలో పిడుగులు పడిన సంఘటనలు
- ఏప్రిల్‌లో 25 గొర్రెలు, గొర్రెల కాపరి మృతి
- జాగ్రత్తగా ఉండాలని వాతావరణ నిపుణుల సూచన



ఆకాశంలో మెరుపులు (ఫైల్)



గడిగరేవుల గ్రామంలో మృతి చెందిన గొర్రెలు (ఫైల్)

గడివేముల: వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈదురుగాలులు.. ఉరుములు, మెరుపులు. వీటికి తోడు పిడుగులు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తాయి. వర్షం కురిసే సమయంలో వీలైనంత వరకు బయటకు రాకపోవడం మంచిదని వాతావరణ నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు వచ్చినప్పుడు అప్రమత్తం కావాలని, చిన్నపాటి వర్షం ప్రారంభమైనప్పుడే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. చల్లబడిన మేఘం నుంచి విడిపోయిన మంచుకణాలు ఈదురుగాలుల కారణంగా రాపిడికి గురవ్వడంతో పిడుగులు పడతాయని, ఆ సమయంలో ఎత్తయిన ప్రదేశాలు, చెట్ల కింద ఉండవద్దంటున్నారు. పిడుగుపాటుకు గురై ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు, ఆస్తి నష్టం సంభవించిన ఘటనలు కోకొల్లలు అని, చిన్న పాటి జాగ్రత్తలు తీసుకుంటే పిడుగుల బారిన పడకుండా తప్పించుకోవచ్చని చెబుతున్నారు. ఏప్రిల్ 19వ తేదీ అర్ధరాత్రి కురిసిన వర్షానికి పిడుగులు పడడంతో గడిగరేవుల, చిందుకూరు గ్రామాల పొలిమేరలో 25 గొర్రెలు మృతి చెందాయి. వెల్దుర్తి మండలం గుంటుపల్లికి చెందిన గొర్రెల కాపరి గొల్ల శేఖర్ (49) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే విధంగా మే 7వ తేదీ పెసరవాయి గ్రామంలో పిడుగుపడడంతో సుమారు 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయి.



చిందుకూరు గ్రామంలో పిడుగుపాటుకు మృతి చెందిన గొల్ల శేఖర్ (ఫైల్)

**పాటించాల్సిన జాగ్రత్తలు**

- ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే సమయంలో ల్యాండ్‌లైన్ ఫోన్‌లో మాట్లాడకూడదు.
- ల్యాండ్ ఫోన్‌కు బదులు సెల్‌ఫోన్ వాడవచ్చు. అది కూడా ఇంట్లో ఉండి వాడాలి.
- ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో టీవీ చూడడం ప్రమాదకరం. అంతేకాకుండా స్విచ్ బోర్డుల నుంచి ప్లగ్‌లు తీసివేయాలి. లేదంటే ఎలక్ట్రిక్ వస్తువులన్నీ పాడయ్యే ప్రమాదం ఉంది.
- ఇంటి కిటికీలు, తలుపుల దగ్గర నిలబడి బయటకు చూడడం అంత మంచిది కాదు.
- ఉరుములు, మెరుపులు సమయంలో చెట్ల కిందకు అస్సలు వెళ్లకూడదు.
- పిడుగులు పడే సమయంలో ఎత్తు తక్కువగా ఉండే ప్రదేశాల్లో తల కిందకు వంచి చెవులు, కళ్లు మూసుకుని కూర్చోవాలి.
- ఆవులు, గేదెలు, కుక్కలు వంటి వాటిని బయట వదిలేయకుండా షెడ్లలోనే ఉంచాలి.
- విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉండొద్దు.
- ఉరుములు సమయంలో మన శరీరం జలదరింపునకు గురవ్వడం, వెంట్రుకలు నిక్కపొడుచుకోవడం వంటి సంకేతాలు కనిపిస్తే పిడుగు మీ దగ్గరలో పడుతున్నట్లు గుర్తించాలి.

### కుమారస్వామికి షష్ఠి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో బుధవారం షష్ఠి సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.